క్లుప్తంగా

క్రీడాకారులకు హాకీ బంతుల పంపిణీ



క్రీడాకారులకు హాకీ బంతులను అందజేసిన పీడీ దుర్గారావు

యలమంచిలి రూరల్: రథసప్తమి సందర్భంగా నక్కపల్లి మండలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కొఠారు దుర్గారావు మంగళవారం యలమంచిలి రాజీవ్ క్రీడా మైదానంలో హాకీ క్రీడాకారులకు 50 హాకీ బంతులను అందజేశారు. యలమంచిలి పట్టణంలో హాకీ సీనియర్ క్రీడాకారుడిగా గుర్తింపు పొందిన దుర్గారావు ప్రస్తుతం పీడీగా పనిచేస్తున్నారు. ఇక్కడ సాధన చేస్తున్న హాకీ క్రీడాకారులకు మెలకువలు నేర్పించనున్నట్లు ఆయన తెలిపారు.

రోజూ పని కల్పించాలని వినతి



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

యలమంచిలి రూరల్: కొక్కిరాపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానంలో పనిచేస్తున్న వ్యవసాయ కూలీలకు రోజూ పని కల్పించాలని సీఐటీయూ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళవారం కార్యాలయ అధికారి కుమార్‌కు మండల కార్యదర్శి సీహెచ్ శివాజీ నేతృత్వంలో వినతిపత్రం అందజేశారు. కొక్కిరాపల్లి వ్యవసాయ ప్రయోగశాలలో కొన్ని సంవత్సరాల నుంచి వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్న 70 మంది రొటేషన్ పద్ధతిలో పనిచేస్తున్నారని, వారందరికీ రోజూ పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు ధనలక్ష్మి, ఈశ్వర్ భాయ్, శ్రీదేవి, లక్ష్మి పాల్గొన్నారు.

లోపాలను సవరించేందుకు రీ-సర్వే



రీ-సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

మునగపాక: రైతులు అందుబాటులో ఉంటూ రీ-సర్వేను చేయించుకోవాలని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు కోరారు. మండలంలోని చెర్లోపాలెం శివారు నరేంద్రపురంలో రీ-సర్వే పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. రీ-సర్వేలో గతంలో జరిగిన లోపాలను సవరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కార్యక్రమం చేపట్టిందన్నారు. ఉప సర్పంచ్ బోజా శ్రీనివాసరావు, రీ-సర్వే డీటీ పడాల్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



ఎంఈవో- 2ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం: మండలంలో ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూ నాయకుడు శ్రీనివాస్ కోరారు. మంగళవారం స్థానిక విద్యా శాఖ కార్యాలయంలో ఎంఈవో -2 స్వప్నప్రియారెడ్డిని కలిసి ఘనంగా సత్కరించారు. ఎంఈవో -2 మాట్లాడుతూ వచ్చే నెలలో పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలన్నారు. హెచ్ఎంలు శ్రీను, సత్యనారాయణ, ఉపాధ్యాయులు చక్రవర్తి, అప్పారావు, రామారానాయుడు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు



కౌన్సెలింగ్ చేస్తున్న ఎస్ఐ ప్రసాదరావు

మునగపాక: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసులు తప్పవని ఎస్ఐ పి.ప్రసాదరావు హెచ్చరించారు. మునగపాకలో మంగళవారం రాత్రి కౌన్సెలింగ్ నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 20 మందిపై కేసు నమోదు చేశారు. ఎవరైనా అనధికారికంగా మద్యం విక్రయించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

కలిసిరాని లక్ బొమ్మలు

- కైలాసపట్నం హస్తకళాకారుల ఆర్థిక ఇబ్బందులు
- లక్కబొమ్మలకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువు
- కనుమరుగవుతున్న వృత్తిదారులు



ఆకట్టుకుంటున్న వేంకటేశ్వరస్వామి బొమ్మ



కైలాసపట్నంలో లక్కబొమ్మను తయారు చేస్తున్న కళాకారుడు



గాంధీ తాత

కోటవురట్ల: అంకుడు కర్రతో అద్భుతాలు సృష్టించే లక్కబొమ్మల బ్రహ్మల తలరాత మారడం లేదు. రేయింబవళ్లు శ్రమించి సృజనాత్మకతను అద్ది జీవం ఉట్టిపడేలా లక్కబొమ్మలను తయారు చేసే హస్తకళాకారులు ఆర్థికంగా సతమతమవుతున్నారు. లక్కబొమ్మ పేరు చెప్పగానే ఠక్కున గుర్తుకొచ్చేది ఏటికొప్పాక.. ఇదే తరహాలో మండలంలోని కైలాసపట్నం గ్రామంలో లక్కబొమ్మలు తయారవుతాయంటే ఆశ్చర్యపోక తప్పదు. ఇక్కడ తయారైన లక్కబొమ్మలను ఏటికొప్పాక పట్టుకెళ్లి అక్కడి వ్యాపారులకు విక్రయిస్తారు. మరికొంత మంది కళాకారులు ఆదాయాన్ని పెంచుకునే మార్గంలో తమ కళకు పదునుపెట్టి ఆకట్టుకునే రీతిలో తయారు చేసి లేపాక్షి హస్తకళల ఎగ్జిబిషన్‌కు విక్రయిస్తున్నారు. నెలకోసారి తాము తయారు చేసిన లక్కబొమ్మలను విశాఖ, రాజమహేంద్రవరం, విజయవాడలో లేపాక్షి హస్తకళల కార్యాలయానికి తీసుకెళ్లి ఇస్తున్నారు.

అంకుడు కర్రకు అనుమతి ఇవ్వాలి...

లక్కబొమ్మల తయారీకి ప్రధానంగా కావలసిన అంకుడు కర్రకు మంచి డిమాండ్ ఉంది. ఈ కర్ర విక్రయాలకు అటవీ శాఖ అనుమతి లేకపోవడంతో చాటుమాటున కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది. దాంతో విక్రయదారులు తరచూ ధర పెంచుతూ పోవడంతో కళాకారులపై భారం పడుతోంది. చేసిన పనికి గిట్టుబాటు కాని పరిస్థితి నెలకొంది. అంకుడు కర్రను రోలుగుంట, తాండవ, నీలంపేట ప్రాంతాల నుంచి తీసుకొచ్చి అనధికారికంగా విక్రయిస్తుంటారు. అంకుడు కర్రను అటవీ శాఖ ద్వారా అధికారికంగా విక్రయించాలని హస్తకళాకారులు కోరుతున్నారు. అంతే కాకుండా ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి కళాకారులకు రాయితీపై రుణాలు ఇవ్వాలని కోరుతున్నారు.

అబ్బుర పరిచే బొమ్మలు వీరి సొంతం..

సహజ సిద్ధమైన రంగులతో తయారవుతున్న లక్కబొమ్మలకు దేశ, విదేశాల్లో మంచి గిరాకీ ఉంది. ప్రతీ ఇంటి షోకేస్‌లో లక్కబొమ్మలు ఉండి తీరాల్సిందే. మోడ్రన్ యువతులకు చెవి రింగుల నుంచి పెద్ద సైజులో దేవతామూర్తుల బొమ్మల వరకు వీరి చేతివేళ్లతో రూపుదాల్చుకుంటాయి. బిడ్డను లాలిస్తున్న మాతృమూర్తి, హలం పట్టిన రైతన్న, కాడెడ్ల బండితో సవారీ చేస్తున్న రైతుబిడ్డ, పెళ్లితంతు ఉట్టిపడే వాతావరణంతో బొమ్మలు ఒకటేమిటి ఎలా కావాలన్నా చేతికి పని చెప్పి లక్కబొమ్మలను ఇట్టే తయారు చేసి ఇచ్చేస్తారు. ఇక్కడి కళాకారులు తయారు చేసిన బొమ్మలకు పురస్కారాలు వచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి. 2018లో లేపాక్షి హస్తకళల ఎగ్జిబిషన్‌లో ఇక్కడి కళాకారుడు తంగేటి అయ్యన్న రూపొందించిన కాడెడ్ల బండి ఉత్తమ పురస్కారాన్ని పొందింది.





బొమ్మను తయారు చేస్తున్న కళాకారుడు

శిక్షణతో నైపుణ్యానికి మెరుగులు..

కైలాసపట్నంలో 30 కుటుంబాలు లక్కబొమ్మల తయారీలో ఉపాధి పొందుతున్నాయి. గతంలో 150 కుటుంబాల వరకు ఉండగా, తయారీ భారం కావడంతో ఈ వృత్తిని వదిలి వేరే పనుల్లోకి పోయాయి. 150 ఏళ్లుగా ఇక్కడ లక్కబొమ్మల తయారీ ఉన్నప్పటికీ సరైన ప్రోత్సాహం, ఆదరణ లేకపోవడంతో మరుగున ఉండిపోయాయి. మార్కెటింగ్ సౌలభ్యం, ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో వెలుగులోకి రాలేదు. వీరి ప్రతిభను గుర్తించిన లేపాక్షి ఏటా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి నైపుణ్యం మెరుగుపరుస్తోంది. ఏడాదికి ఒకసారి రెండు నెలల పాటు శిక్షణ ఇస్తారు. ఆధునికతను జోడించి అపురూపమైన బొమ్మలను తయారు చేస్తున్నారు. ఈ శిక్షణకు హైదరాబాద్, మైసూరు నుంచి డిజైనర్లు వచ్చి కొత్త డిజైన్లపై తర్ఫీదునిస్తారు.



బిడ్డను లాలిస్తూ మాతృమూర్తి



హరిదాసు

కైలాసపట్నం పేరు వినిపించాలని ఆశ..



ఏటికొప్పాక లక్కబొమ్మలకు వచ్చిన గుర్తింపు కైలాసపట్నానికి రావాలని నా ఆశ. ఇక్కడ ఎందరో కళాకారులు నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. సరైన ప్రోత్సాహం ఉంటే అద్భుతమైన బొమ్మలు ఇక్కడి నుంచి వస్తాయి. మాకు ఓ సొసైటీ ఉన్నప్పటికీ ఆదరణ లేదు. ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించాలి. కళాకారుల కుటుంబాలకు ఆదుకోవాలి.

– తంగేటి వెంకట గణేష్, హస్తకళాకారుడు, కైలాసపట్నం

ప్రోత్సాహం ఇవ్వండి..



నేను తయారు చేసిన లక్కబొమ్మలు ఎన్నో ఉత్తమ పురస్కారాలు పొందాయి. మా తాత, మేనత్తల నుంచి ఇదే వృత్తిలో ఉన్నాం. మేము తయారు చేసిన బొమ్మలకు ప్రశంసలు వచ్చాయి. కానీ మాకు మాత్రం తగిన గుర్తింపు రాలేదు. బొమ్మల తయారీకి కావలసిన ఆధునిక మిషన్లను ప్రభుత్వం అందిస్తే బాగుంటుంది.

– తంగేటి అయ్యన్న, హస్తకళాకారుడు, కైలాసపట్నం

ప్రభుత్వమే స్టాల్ ఏర్పాటు చేయాలి



మేము తయారు చేసిన బొమ్మలకు మంచి పేరు వచ్చినా మా జీవితాలలో మాత్రం మార్పు రాలేదు. రాష్ట్ర ప్రభుత్వ సహకారం అవసరం ఉంది. డీఆర్‌డీఏ ద్వారా ప్రత్యేక రాయితీ రుణాలు అందివ్వాలి. కై లాసపట్నంలో ప్రభుత్వం తరఫున విక్రయ స్టాల్‌ను ఏర్పాటు చేసి కళాకారులు నేరుగా అమ్ముకునేలా ప్రోత్సహించాలి.

– తంగేటి రాంబాబు, హస్తకళాకారుడు, కైలాసపట్నం

క్యాన్సర్‌ను మొదటి దశలో గుర్తించాలి



క్యాన్సర్ నివారణకు కృషి చేయాలంటూ నినదిస్తున్న ఆశ కార్యకర్తలు



అచ్యుతాపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాక: క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తించడం ద్వారా మరణాలు సంభవించవని వైద్యాధికారి ప్రవళిక పేర్కొన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. క్యాన్సర్ సోకకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఈ నెల 13న కుష్టు నివారణలో భాగంగా స్పర్శ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీహెచ్‌వో దేవకాంత పాల్గొన్నారు.

అచ్యుతాపురం: వాతావరణంలో కాలుష్యం, ప్లాస్టిక్ వస్తువుల్లో వేడి పదార్థాలను తినడం ద్వారా, జంక్ ఫుడ్స్ వల్ల క్యాన్సర్ కణాలు శరీరంలోకి ప్రవేశించి ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్నాయని వైద్యాధికారి లిఖిత తెలిపారు. అచ్యుతాపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 40 ఏళ్లు దాటిన వ్యక్తులు ఆరు నెలలకొకసారి మామోగ్రఫీ, స్కానింగ్ చేయించుకోవాలని తెలిపారు. మద్యపానం, ధూమపానం, సరైన సమయంలో ఆహారం తీసుకోకపోవడం, వాడిన నూనెతోనే మళ్లీ మళ్లీ వంటలు చేయడం ద్వారా క్యాన్సర్ సోకే అవకాశాలు ఉన్నాయన్నారు.

గ్రామాల్లో ఉత్సవాలు ఐక్యతకు ప్రతీక



స్వామివారిని దర్శించుకుంటున్న కంబాల జోగులు తదితరులు

ఎస్.రాయవరం: గ్రామాల్లో ఉత్సవాలు ప్రజల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పెట్టుగొళ్లపల్లిలో అభయాంజనేయ 24వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు వియ్యపు వరహాలరావు, చొప్పా రాజు, వియ్యపు సింహాద్రి పాల్గొన్నారు.

రైతులందరికీ ఆధార్ తరహా గుర్తింపు కార్డులు

ఆర్‌డీవో రమణ



వివరాలు వెల్లడిస్తున్న ఆర్‌డీవో రమణ

నక్కపల్లి: రైతులందరికీ ఆధార్ తరహా గుర్తింపు కార్డులు అందించనున్నట్లు నర్సీపట్నం ఆర్‌డీవో వి.వి. రమణ తెలిపారు. మంగళవారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయశాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఏవో ఉమాప్రసాద్ రైతులకు ప్రభుత్వం జారీ చేస్తున్న గుర్తింపు కార్డుల గురించి వివరించారు. ఆర్‌డీవో మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయడానికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా రైతులకు ఆధార్ తరహా 11 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఆమోదించడానికి ఫార్మర్ రిజిస్ట్రీని ఏర్పాటు చేశాయన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు ఆధార్ తరహా ఐడీ కార్డులు అందజేస్తామన్నారు. ఇది వ్యవసాయ రుణాలు, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంట నష్టపరిహారం, పంటల బీమా తదితర పథకాలు పొందవచ్చన్నారు.

వేడుకగా ఆంజనేయ స్వామి తీర్థం

అచ్యుతాపురం: స్థానిక జంక్షన్‌లోని ఆంజనేయ స్వామి తీర్థాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని పలువురు భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పులిహోర పంపిణీ చేశారు. మధ్యాహ్నం భారీ సమారాధన ఏర్పాటు చేశారు.

అపరాల పంటలపై అవగాహన



పెదపల్లిలో రైతులకు సూచనలిస్తున్న ఏవో మోహన్‌రావు

పాయకరావుపేట: రైతులు అపరాల పంటలపై అవగాహన కలిగి ఉండాలని ఏవో పి.ఆదినారాయణ అన్నారు. పొలం పిలుస్తోందిలో భాగంగా మంగళవారం వెంకటనగరం గ్రామ రైతులకు అవగాహన కల్పించారు. క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి, వాటికి ఉపయోగించే క్రిమి సంహారక మందుల గురించి వివరించారు.

పొగాకు సాగు లాభదాయకం

యలమంచిలి రూరల్: మండలంలోని పెదపల్లి, యర్రవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో పాలిమేర మోహన్‌రావు మాట్లాడుతూ క్యూరింగ్ చేసే పద్ధతిని బట్టి పొగాకు మంచి ధర లభిస్తుందని చెప్పారు. పొగాకు సాగులో మెలకువలు గురించి వివరించారు. మిగిలిన గ్రామాల్లో మామిడి, జీడి మామిడి పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ సహా సంచాలకులు దివ్య ప్రసన్న, రైతులు అప్పలస్వామి పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణ లక్ష్యం

అచ్యుతాపురం: సనాతన ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సమరసతా సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ బి.వి రమణ తెలిపారు. మంగళవారం కొండకర్ల రామాలయంలో సమరసతా సేవా ఫౌండేషన్ కార్యక్రమాల కరపత్రాలను ఆవిష్కరించారు. కొల్లి అప్పారావు, గుడివాడ రమణ, బంటు రాము, కంఠంరెడ్డి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాండురంగ స్వామి తిరు కల్యాణం



స్వామివారి తిరు కల్యాణోత్సవంలో భక్తులు

పాయకరావుపేట: పట్టణంలో రాధా రుక్మిణీ సహిత పాండురంగ స్వామి తిరు కల్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అగ్ని ప్రతిష్ట ధ్వజారోహణ, సాయంత్రం స్వామి ఎదురు సన్నాహం నిర్వహించారు. అనంతరం తిరు కల్యాణ మహోత్సవం చేశారు. అర్చకులు యియ్యుణ్ణి నారాయణా చార్యులు, కృష్ణస్వామి, వేద పండితులు కల్యాణానికి హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

మత్స్యకార భరోసా విడుదల చేయాలి

సీపీఐ నేతలు డిమాండ్



మత్స్యకార భరోసా విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్న సీపీఐ నాయకులు

నక్కపల్లి: ఎన్నికల హామీ మేరకు మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ఇచ్చే భృతి తక్షణమే విడుదల చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దొరబాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన రాజయ్యపేటలో మత్స్యకారులను కలిసి మత్స్యకార భరోసాపై ఆరా తీశారు. గత ప్రభుత్వం వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.10 వేల చొప్పున భృతి అందించిందన్నారు. కూటమి అధికారంలోకి వస్తే మత్స్యకార భరోసా కింద రూ.20 వేలు చెల్లిస్తామని చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేష్ హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడిచిందని, మరో రెండు నెలల్లో వేట నిషేధం అమల్లోకి వస్తుందన్నారు. అయినప్పటికీ ఇప్పటి వరకు పైసా సాయం చేయలేదన్నారు. ప్రకృతి వైపరీత్యాలు కారణంగా ఏడాదిలో ఆరు మాసాలు మత్స్యకారులు చేపల వేటకు దూరమవుతున్నారన్నారు. వేట తప్ప వేరే ఉపాధి పనులు తెలియని గంగపుత్రులకు తక్షణమే భృతి విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు వెలుగుల అర్జున్, సన్యాశిరావు, మండల కార్యదర్శి అజయ్, బాబ్జి, అంజి పాల్గొన్నారు.

ముగిసిన మెడికల్ విద్యార్థి అంత్యక్రియలు



విద్యార్థి షణ్ముఖ నాయుడు అంతిమ యాత్రలో మునగపాక గ్రామస్తులు

మునగపాక: పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలంలో మృత్యువాతకు గురైన మునగపాకకు చెందిన వైద్య విద్యార్థి పెంటకోట షణ్ముఖ నాయుడు అంత్యక్రియలు మంగళవారం అశ్రునయనాల మధ్య జరిగాయి. స్నేహితులతో కలిసి బీచ్‌కు వెళ్లిన షణ్ముఖనాయుడు గల్లంతైన తర్వాత అతని మృతదేహాన్ని గుర్తించిన అధికారులు అక్కడ ప్రభుత్వ ఆస్పత్రిలో శవ పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అక్కడ నుంచి స్వగ్రామం మునగపాకకు తీసుకువచ్చారు. తల్లిదండ్రులు కాశీ, మాధవిలతో పాటు కుటుంబ సభ్యులు బోరున విలపించారు. అక్కడ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించగా, కడసారి చూసేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నివాళులర్పించారు.

పదిలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఆరా తీస్తున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

యలమంచిలి రూరల్: జంపపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి చదువుకు సంబంధించిన పురోగతిని యలమంచిలి ఉపవిద్యాశాఖాధికారి అప్పారావు మంగళవారం రాత్రి పరిశీలించారు. ఉపాధ్యాయులు, హెచ్ఎంలు తమ విద్యార్థులు ఇళ్ల వద్ద బాగా చదివేలా చైతన్యవంతం చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆయన వెంట జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఏవీహెచ్ శాస్త్రి, కేఆర్ నాయుడు, కృష్ణారావు, సుధాకర్, వెంకట శివ, నాగరాజు, సత్యనారాయణ, శ్రీనివాసరావు, షబ్బీర్, గ్రామ పెద్దలు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యక్ష దైవానికి ప్రత్యేక పూజలు

భక్తి శ్రద్ధలతో రథసప్తమి



సూర్యభగవానుడికిపూజలునిర్వహిస్తున్న దృశ్యం



పాండురంగ ఆలయంలో రథసప్తమి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

నక్కపల్లి: రథసప్తమి పర్వదినాన్ని మంగళవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాల్లో భాస్కరుడికి ప్రత్యేక పూజలు చేశారు. సూర్యారాధన వల్ల ఆయురారోగ్య, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయనేది విశ్వాసం. ఈ సందర్భంగా అరుణోదయ వేళలో జిల్లేడు ఆకులు భుజాన పెట్టి రేగుపళ్లు తలపై పెట్టుకుని స్నానం చేశారు. ఏడు చిక్కుడుకాయలతో రథాన్ని తయారు చేసి జిల్లేడు ఆకులపై ప్రసాదం ఉంచి సూర్య భగవానుడికి నైవేద్యం పెట్టారు.

పాయకరావుపేట: పట్టణంలో రాధా రుక్మిణీ సహిత పాండురంగస్వామి ఆలయంలో రథసప్తమి పూజలు చేశారు. అర్చకులు యియ్యుణ్ణి నారాయణాచార్యులు, కృష్ణస్వామిల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

కోటవురట్ల: మండలంలో ఆరోగ్య ప్రదాత సూర్యభగవానుడికి పూజలు చేశారు. లోగిళ్లలో ఆరుబయట పొయ్యి ఏర్పాటు చేసి ఆవు పిడకలతో పాలు మరిగించి ప్రసాదం తయారు చేశారు.